క్లుప్తంగా

అక్రమ బదిలీలు నిలుపుదల చేయాలి

సీతంపేట: గ్రామ సచివాలయాల సిబ్బంది అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలని ఎంపీపీ బి.ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల పరిధిలోనే సచివాలయ సిబ్బందిని బదిలీ చేయాలన్నారు. కొంతమందికి ఇతర మండలాలకు బదిలీ చేసి.. మరికొందరిని మండలంలోనే ఉంచడం సరికాదన్నారు. ఒకే జీఓ ప్రాప్తికి మండలాల్లోనే బదిలీలు చేపట్టాలని స్పష్టం చేశారు. అగ్రికల్చర్ సిబ్బంది అసలే తక్కువ మంది ఉన్నారని.. వీరిని వేరే మండలాలకు ట్రాన్స్‌ఫర్ చేయడం తగదన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



బలిజిపేట వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు సురేష్

బలిజిపేట: ఆషాడమాసం తొలి ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఏకాదశి పర్వదినంతో రానున్న రోజులలో పూజల నిర్వహణకు మార్గం సుగమమైనట్లేనని అర్చకులు చెబుతున్నారు. అందులో భాగంగా బలిజిపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు హరి ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినం ఎంతో గొప్పదని స్వామివారిని ప్రార్థించి ఆయన కృపకు పాత్రులవ్వాలని అర్చకుడు హరి భక్తులకు సూచించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

చాతుర్మాస దీక్ష ప్రారంభం



శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం చేస్తున్న భక్తులు

సాలూరు: పట్టణంలోని పెదకోమటిపేట సీతారామదేవస్థానం వద్ద సామూహిక శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం ఆషాడ శుద్ధ ఏకా దశి సందర్భంగా ఆదివారం ప్రారంభించారు. చాతుర్మాస దీక్షలో భాగంగా ప్రారంభించిన ఈ సామూహిక శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం నవంబరు 2 కార్తీక శుద్ధ ద్వాదశి వరకు ప్రతిరోజూ ఉదయం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

జాతీయ స్థాయి సమ్మెను విజయవంతం చేయాలి



ఆర్.వెంకంపేటలో ప్రజా సంఘాల మద్దతు కోరుతున్న భవన నిర్మాణసంఘం నాయకులు

సీతానగరం: ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెలలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సమ్మెను విజయవంతం చేయాలని భవన నిర్మాణ, అసంఘటిత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు ఆర్.రాము, జి.వెంకటరమణ కోరారు.

పంట మార్చుద్దాం..
దిగుబడి పెంచుదాం!



పొలాన్ని దున్నుతున్న రైతు

గుమ్మలక్ష్మీపురం:

పొలంలో ప్రతిసారి వేసిన పంటనే మళ్లీ వేయడం వల్ల దిగుబడులు తగ్గడంతో పాటు తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది. అలా కాకుండా ఏటా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఒకే రకం కాకుండా అనేక రకాల పంటలను ఓ క్రమ పద్ధతిలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు పొందవచ్చని చెబుతున్నారు. పంట మార్పిడి చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అధిక లాభం పొందవచ్చు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుకు సిద్ధమైన అన్నదాతలు పంట మార్పిడి ఆవశ్యకతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రైతు లాభాలకు పంటల మార్పిడి ఊతం
- పంటల మార్పిడితో అధిక దిగుబడులు
- తెగుళ్లు, చీడపీడల బెడద సాధ్యమే..

- ఒకే పంటతో నష్టాలివే..
- ఏటా ఒకే రకం పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అంతగా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి
- రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది
- వేరువ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యంగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు
- ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు, తక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. ఉదాహరణకు జొన్న, పత్తి
- నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి వేసుకోవాలి
- పంట మార్పిడితో భూసారం
- వరి పంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరిగి సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండడం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది
- వరి తర్వాత అపరాలు వంటి పైర్లు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థాలు బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటలపై వచ్చే శిలీంద్రాలు ఉధృతి తగ్గుతుంది.
- వరి తర్వాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ వంటివి సాగు చేయడం వల్ల వాటి వేర్లలోని రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లలో బుడిపెల మాదిరి ఏర్పడిన తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

పంట మార్పిడి ఉత్తమం..

ఏటా ఒకే పంట సాగు చేయకుండా పంటను మార్చి మార్చి వేస్తే మంచి దిగుబడులు వస్తాయి. నీటి సదుపాయం ఉన్న చోట వరి తప్ప వేరే పంటలు వేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చు పెరిగిపోతోంది. దీన్ని నివారించేందుకు పంట మార్పిడి చాలా ఉత్తమం. రైతులంతా విధిగా పంట మార్పిడి చేపట్టాలి.

-పి.శంకరరావు,
మండల వ్యవసాయాధికారి, గుమ్మలక్ష్మీపురం

పరామర్శ..

భామిని:

మండలంలోని కోసలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు అస్వస్థతకు గురి కావడంతో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ మజ్జి శ్రీదేవి,తదితరులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.ఫాల్గుణరావు, వి.పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మోహన్‌బాబును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పత్తి బకాయిలు చెల్లించాలి

భామిని: పత్తి కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన ముడిపత్తి బకాయిలు ఇంతవరకు చెల్లించకపోవడం దారుణమని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, మండల నాయకులు కొత్తకోట బాబూరావు, బిడ్డిక కాంతారావు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ...ఈ ఏడాది జనవరిలో కొనుగోలు కేంద్రంలో చాలా మంది రైతులు పత్తి విక్రయించారన్నారు. అయితే ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న రైతు సంఘు నాయకులు అప్పలనాయుడు, బాబూరావు, కాంతారావు

పెరగని పైనాపిల్ ధర



మార్కెట్‌లో పైనాపిల్

సీతంపేట: మండల కేంద్రంలోని మార్కెట్‌లో పైనాపిల్ ధర పది రూపాయాల్లోపే పలికింది. ఆదివారం ఉదయం పది గంటల వరకు ఒక్కో కాయ పది రూపాయలు పలకగా... సాయంత్రానికి రూ. 8 చొప్పున విక్రయించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర పెంచడం లేదని గిరిజన రైతులు వాపోతున్నారు.

ఇష్టానుసారం వాహనాల నిలుపుదల

- స్తంభిస్తున్న ట్రాఫిక్



ముందు వాహనం నిలిచిపోవడంతో స్తంభించిన ట్రాఫిక్

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని అంతర్రాష్ట్ర రహదారిపై ఎటువైపు వెళ్లినా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లు సరిగ్గా లేక, విస్తీర్ణం చాలక తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహన చోదకులు భారీ వాహనాల రాకపోకలతో మరింత ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు. ఇదిలా ఉంటే కొంత మంది భారీ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ ఇష్టాను సారం కొంతసేపు నిలిపివేస్తుండడంతో వెనుకవైపు వస్తున్న పదుల సంఖ్యలో వాహనాలు వేచి ఉండి ట్రాఫిక్ సమస్యకు గురవుతున్న పరిస్థితి నెలకొంటోంది. బాధ్యతా రహితంగా రద్దీగా ఉండే కూడళ్లలో సైతం వాహనాలను వారికి ఇష్టం వచ్చినట్లు నిలిపివేస్తున్నారని, దీంతో ద్విచక్ర వాహన దారులకు, అత్యవసర సేవలందించే వాహనాలకు సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లేబర్ అధికారులు లేకుండా కార్మికులకు న్యాయం ఎలా?



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు ఎన్‌వైనాయుడు తదితరులు

సాలూరు: జిల్లాలో సాలూరు, పార్వతీపురం, పాలకొండ అసిస్టెంట్ లేబర్ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో లేబర్ అధికారులు లేరని, అధికారులు లేకుండా కార్మికులకు న్యాయం ఎలా చేయగలరని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇన్‌చార్జ్ లేబర్ అధికా రులను నియమించి, కార్మికశాఖను నిద్రావస్థలోకి రాష్ట్ర ప్రభుత్వం నెట్టేసిందని విమర్శించారు.జిల్లాలో ఇప్పటికే పరిశ్రమలు లేక కార్మికవర్గం దీనస్థితి లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జీగిరాం జూట్ మిల్లు మూసివేసినా ప్రభుత్వం, లేబర్ అధికారుల్లో చలనం లేదని విమర్శించారు. కలెక్టర్ స్పందించి జిల్లాలో అవసరమైన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌లను నియమించి, ప్రజలకు సేవలు అందేందుకు కృషిచేయాలని కోరారు. లేకుంటే భవిష్యత్‌లో వచ్చే కార్మి క సమస్యలపై పెద్దఎత్తున ఆందోళనకు సీఐటీయూ కార్మికవర్గాన్ని సిద్ధం చేస్తుందన్నారు.



పాలకొండ రూరల్: పిన్నమ్మ గడి వద్ద భక్తుల పూజలు అందుకుంటున్న సుబద్ర బలభద్ర సహిత జగన్నాథుడు



పాలకొండ రూరల్: జగన్నాథుని రథయాత్రలో పాల్గొన్న భక్తుల కోలాహలం

వైభవోపేతంగా జగన్నాథుని రథయాత్ర

జగన్నాథుని మధ్యమ యాత్ర (తిరుగు ప్రయాణం) ఆదివారం కనులపండువగా జరిగింది. తొలి ఎకాదశిని పురస్కరించుకుని నిర్వహించే యాత్రకు భక్తులు పోటెత్తారు. గుడించా మందిరం నుంచి తిరుగు ప్రయాణ యాత్రలో భాగంగా సుబద్ర, బలభద్ర సహిత జగన్నాథుడు ఆయన పిన్ని, దేవకీదేవి మందరం చేరుకున్నారు. స్వామివారిని సోమవారం ప్రధాన ఆలయానికి తీసుకెళ్తామని ప్రధాన అర్చకుడు విశ్వనాథ దాస్ తెలిపారు.

\- పాలకొండ రూరల్



పాలకొండ రూరల్: యాత్రా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జైయింట్ వీల్ వద్ద సందడి





ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తచర్యగా ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్‌లు ధరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్నవారు ద్విచక్రవాహనాలతో ప్రయాణం చేస్తున్న సమయంలో ప్రమాదాల బారిన పడుతూ రక్తస్రావంతో ప్రాణాయంలో ఉంటున్నారన్నారు. ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్‌లు ధరించాలని సూచించారు. హెల్మెట్‌లు ధరించని ద్విచక్ర వాహన చోదకులపై కేసులు నమోదు చేసి, అపరాధరుసుం విధించనున్నట్లు తెలియజేశారు. ద్విచక్ర వాహనాల ను చిన్న పిల్లలకు ఇస్తే ప్రమాదానికి గురైతే వాహన యజమానికి, డ్రైవింగ్ చేసే వ్యక్తిపై కేసులు ఉంటా యని పిల్లల భవిష్యత్‌పై ప్రభావం పడుతుందన్నా రు. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్టినింట ఇమడలేక వస్తే..
పుట్టింటోళ్లూ పొమ్మంటున్నారు!

జియ్యమ్మవలస రూరల్: మెట్టినింట వేధింపులు తట్టుకోలేక పుట్టింటికి వస్తే వాళ్లూ వెళ్లిపొమ్మంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తోందో..మహిళ. ఈ చిత్రంలో తల్లి దమయంతితో పాటు కనిపిస్తున్న బాధిత మహిళ పేరు అమూల్య. ఈమెది జియ్యమ్మవలస మండలం, గడసింగుపురం. ఈమెకు అదే గ్రామానికి చెందిన బొమ్మాళి రాజారావుతో 2021లో వివాహమైంది. కొన్నాళ్ల పాటు వీరి దాంపత్య జీవితం సాఫీగానే కొనసాగింది. ఆ తర్వాత బార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు రావడంతో పాటు అత్తింటి వారు(అత్త, మామ, ఆడపడుచు) కూడా వేధిస్తుండడంతో అవి తట్టుకోలేక అమూల్య పుట్టింటికి వెళ్లింది. ఇది గడిచిన కొన్నిరోజులకు అమూల్యను ఆమె తమ్ముడు గరుగుబిల్లి ఎలియాస్, మరదలు కలిసి తమ ఇంటి వద్ద ఉంటే ఒప్పుకోబోమని, ఇల్లు వదిలి మీ ఇంటికి వెళ్లిపోవాలని తెగేసి చెప్పారు. దీంతో చేసేదేమీ లేక అమూల్య తిరిగి తన భర్త రాజారావు వద్దకు ఆదివారం వెళ్లగా అతడు తన నోటికి ఇష్టం వచ్చినట్లు తిట్టి కొట్టి పంపించాడని అమూల్య వాపోయింది. ఇదే విషయంపై అమూల్య తల్లి దమయంతితో కలిసి జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు.



పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు అమూల్య, పక్కనే తల్లి దమయంతి

వంశధారకు పోటెత్తిన వరద నీరు



నేరడి వద్ద నదీ ప్రవాహం

భామిని: ఆంధ్రా – ఒడిశా సరిహద్దులో ప్రవహిస్తున్న వంశధార నదికీ వరద నీరు పోటెత్తుతోంది. ఎగువ ప్రాంతాల్లో జోరుగా వర్షాలు కురుస్తుండడంతో నదీ ప్రవాహం ఎక్కువగా ఉంది. వంశధార నదికి ఆవల గల ఒడిశా గ్రామాల వారు నాటు పడవలపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

విద్యార్థుల ఆకలి కేకలు వినిపించడం లేదా..?

- మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని.. దీంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. విద్యార్థుల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం హయాంలో విద్యారంగం అస్తవ్యస్తంగా మారిందన్నారు. పాఠశాలలకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించామన్నారు. విద్యార్థుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 8న జరగనున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకాలు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక పశువైద్య శాలలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకాలు ఆదివారం వేశారు. జంతువుల నుంచి మనుషులకు జునోటిక్ వ్యాధులు రాకుండా ఉచితంగా వేస్తున్న ఈ వ్యాక్సిన్లను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు కోరారు. జునోటిక్ వ్యాధులు మొత్తం 280 వరకు ఉండగా వీటిలో ర్యాబిస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమైనదని, దీని నివారణకు ప్రస్తుతం ర్యాబిస్ టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు.



పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేస్తున్న పశువైద్యాధికారి లక్ష్మణరావు

అప్రమత్తంగా ఉండాలి..

పాలకొండ రూరల్: పెంపుడు జంతువుల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల వాటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ సహాయ జె.డి డాక్టర్ శివ్వాల మన్మధరావు సూచించారు. ఆ శాఖ సహాయ సంచాలకుడు ప్రభామాణిక్యరావుతో కలసి పాలకొండలో అంతర్జాతీయ జునోసిస్ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈమేరకు స్థానిక పశువైద్య కేంద్రంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బచ్చు సిద్ధార్థ్, తదితరులు 55 పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు.



పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ వ్యాక్సిన్లు వేస్తున్న వైద్యులు

రామినాయుడుకు ఘనంగా నివాళి

పార్వతీపురం రూరల్: మండలంలోని కృష్ణపల్లి పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోను రామినాయుడు కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం వేకువజామున గ్రామంలో ఉన్న వారి స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆ గ్రామానికి వెళ్లి రామినాయుడు అంతిమయాత్రలో పాల్గొన్నారు. రామినాయుడు సేవలు మరువలేనివని, కృష్ణపల్లిలో చెరగని ముద్ర వేశారని, ముక్కుసూటి వ్యక్తిత్వంతో విలువైన రాజకీయాలు చేసిన ఓ మంచి నాయకుడని జోగారావు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ టిడ్కోఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రామినాయుడు భౌతికాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు